క్లుప్తంగా

కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిప్పొద్దు



బాల్కొండ: కేజ్‌వీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లను తిప్పవద్దని బాల్కొండ ఏఎస్సై శంకర్ సూచించారు. శుక్రవారం కిసాన్‌నగర్‌లో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీ, సీసీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్‌లను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు లింగన్న, నరేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్ నడపకూడదని తీర్మానం

డొంకేశ్వర్(ఆర్మూర్): బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడపకూడదని డొంకేశ్వర్ మండలంలో చిన్నయానం, గాదేపల్లి గ్రామ పంచాయతీలు ఇదివరకు తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. అయితే, శుక్రవారం మారంపల్లి, జీజీ నడ్కుడ గ్రామ పంచాయతీలు కూడా తీర్మానం చేశాయి. ఇనుపచక్రాలతో రోడ్డెక్కితే రూ.3 వేల జరిమానాతో పాటు సమాచారం అందించిన వారికి రూ.500 పారితోషికం ఇవ్వనున్నట్లు తీర్మానాల్లో పేర్కొన్నాయి.

బాధ్యతల స్వీకరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పట్వారి గోపికృష్ణ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బండారి ప్రసాద్, నూతన అధ్యక్షుడు గోపికృష్ణకు కాలర్ వేసి బాధ్యతలు అప్పజెప్పారు. అలాగే కార్యదర్శిగా పట్వారి తులసి కుమార్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు గవర్నర్ విజయసారథి, పాస్ట్ ప్రెసిడెంట్స్ చరణ్ రెడ్డి, పద్మ మురళి, కాంతి గంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, సమాజం గురించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి పుస్తకాలు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ అధ్యక్షుడు చేపూర్ గణేష్, కోశాధికారి పోల్కం వేణు, ఎలెక్ట్ ప్రెసిడెంట్ గుజరాతి ప్రకాశ్, కోశాధికారి నరేందర్, అల్జాపూర్ రాజేశ్, ప్రోగ్రాం చైర్మన్ దాచేపల్లి సంతోష్, హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



ఆర్మూర్: దరఖాస్తు చేసుకున్న గిరిజనేతరులకు, గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో శుక్రవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు భూములపై జరిగిన ఉద్యమంలో కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ హామీ ముందుకు సాగడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చకుంటే కేసీఆర్ మీద ఉద్యమం తప్పదని హెచ్చరించారు. నాయకులు బి.దేవారం ఎం.ముత్తెన్న, బి.కిషన్, గంగాధర్, రాజన్న, రమేష్, గంగన్న, నరేందర్‌లు పాల్గొన్నారు.

బోధన్‌లో 21 పరీక్షా కేంద్రాలు

బోధన్‌టౌన్(బోధన్): టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న గ్రూప్ -4 పరీక్ష కోసం బోధన్ పట్టణంలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 8 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో ఏర్పాటు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ పోటీలకు యువత, విద్యార్థులు పాల్గొనాలని కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేశ్ కోరారు. ఆర్మూర్ పట్టణంలో కాంగ్రెస్ నేతలతో పలు కళాశాలల్లో, గ్రంథాలయంలో విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా రిజిస్టర్ చేయించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఈ పోటీ పరీక్షను జులై 2, 3, 4వ తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు సుద్దపల్లి అఖిల్, అఫ్రోజ్, ఆదిత్య పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మురికినీరు

- అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



నందిపేట మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. చాలా వార్డుల్లో రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తోంది. ఏ వాడలో చూసినా మురికి కూపాలు, పందుల పొర్లడం, చెడు వాసనతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎప్పుడో నిర్మించిన మురికి కాలువలు శిథిలావస్థకు చేరడంతో రోడ్లపై మురికి నీరు పారడం పరిపాటయింది. దీనికి గ్రామపంచాయతీ అధికారులు శాశ్వత పరిష్కారం ఆలోచించడం లేదు. వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచు, వార్డు సభ్యులు, ప్రతి వార్డు తిరిగి రోడ్డు శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందని ప్రజలు అంటున్నారు. నందిపేట మండల కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఈ నిధులతో పనులు జరిగితే మురికి సమస్య పరిష్కారమయ్యేది. గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

> **గ్రామం పెద్దదిగా ఉండడంతో సమస్యలు**
>
> గ్రామంలో మురికి సమస్య ఉన్నది వాస్తవమే. పారిశుధ్య సిబ్బంది ఉన్నా గ్రామం పెద్దదిగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. ప్రతి రోజు ఒక వార్డులో మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. మురికి కాలువలు కూలిపోవడంతో రోడ్లపైకి మురికి నీరు వస్తోంది.
>
> –సౌమ్య, పంచాయతీ కార్యదర్శి, నందిపేట

పల్లెలు పట్టణాలను తలపిస్తున్నాయి

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



కొల్‌పూర్‌లో జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించి పట్టణాలను తలపిస్తున్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొల్‌పూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, మంగళహారతులతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని వాడవాడలా తిరుగుతూ సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కొల్‌పూర్‌లో ఇప్పటికే మంజూరు చేసిన నిధులు, ఇంకా జరుగవలసిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కొల్‌పూర్ శివారులో ఎస్సీ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. సర్పంచు గబ్బర్ సింగ్, ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎర్రం యమున, వైస్ ఎంపీపీ దేవేందర్, సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

ఆర్మూర్: పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలో మైనార్టీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్మాణ పనులను మూడు నెలల్లో పూర్తి చేసి శుభకార్యాలకు అందుబాటులోకి తీసుకురావాలని మర్కజ్ కమిటీ సభ్యులకు సూచించారు. మర్కజ్ కమిటీ అధ్యక్షుడు మొయినుద్దీన్, నాయకులు పండిత్ ప్రేమ్, సంజయ్ సింగ్ బబ్లూ, సుమీర్ అహ్మద్ పాల్గొన్నారు.

హిందూ మహిళల మనోభావాలు దెబ్బతీయొద్దు



ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో శనివారం జరిగే గ్రూప్ -4 పరీక్షలకు గతంలో జరిగిన విధంగా మహిళ మంగళసూత్రాలు, మెట్టెలు, గాజులు, బొట్టు తీసే చర్యలు ఆపాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. గత పరీక్షల సమయంలో జరిగిన పొరపాటు ప్రస్తుతం నిర్వహించే పరీక్షలు సమయంలో చేయవద్దని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్ బాబుకు వారు వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు రవి, గంగాచరణ్, కత్తి శీను, లక్కీ శ్రీధర్, కిశోర్, నిఖిల్ పాల్గొన్నారు.

'రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు'

రెంజల్(బోధన్): రైతుల ముసుగులో రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదని, రైతులు కడుపు మండి రోడ్డు మీదకు వచ్చారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను ఖండించారు. బందల్ల రోడ్డును అడ్డుకోలేదని వివరించారు. ఎనిమిదేళ్ల కిందట రోడ్డుకు రూ.కోటి 56 లక్షలు మంజూరయ్యాయని, ఇప్పుడు తాత్కాలిక మరమ్మతులకు ఎమ్మెల్యే రూ.20 లక్షలు మంజూరు చేశారని చెప్పడంలో అర్థం ఏంటని ప్రశ్నించారు. 20 లక్షలతో మొరం పనులు చేపడితే రైతులు రాకపోకలకు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. నాయకులు చుక్క రాజుగౌడ్, రైతులు పోశెట్టి, రాకేశ్‌రెడ్డి, అశోక్, పాయన్న, సంతోష్‌లు పాల్గొన్నారు.

బంధువుల క్వారీతో మంత్రికి ఏం సంబంధం?



మాట్లాడుతున్న ఎంపీపీ సామ పద్మ

బాల్కొండ: బట్టాపూర్ కంకర క్వారీతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సంబంధం ఏంటని ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ ప్రశ్నించారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి మతి భ్రమించి మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి బంధువులు, మీకు కూడా బంధువులు కాదా అని ప్రశ్నించారు. మంత్రి ఆస్థాన కాంట్రాక్టర్ రమేశ్‌రెడ్డి అంటూ దుమ్మెత్తి పోస్తున్న మీకు మీ తల్లి అన్నపూర్ణమ్మ ఆ రోజుల్లో అదే కాంట్రాక్టర్‌తో పనులు చేపించినప్పుడు కనిపించ లేదా అని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం సర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వారి సేవలు అమూల్యమైనవి



బోధన్ ఆస్పత్రిలో మక్కయ్యను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో 30 ఏళ్లుగా ఎంఎన్‌వోగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన మక్కయ్యను మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అలాగే, మున్సిపాలిటీలో పీహెచ్ వర్కర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన జమునను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సన్మానించారు. వారు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శివశంకర్, కౌన్సిలర్‌లు శ్రీకాంత్ గౌడ్, సత్యం ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

ఆర్మూర్‌టౌన్: పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న జంబి సాయమ్మ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. కమిషనర్ ప్రసాద్ చౌహాన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఆఫీస్ సబార్డినేట్ పదవీ విరమణ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జీపీ ఆఫీస్ సబార్డినేట్ చెంచు లచ్చయ్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఆయనను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, కార్యదర్శి శాంతికుమార్, ఎంపీటీసీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఈ నెల 4న పట్టణ కేంద్రంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ జాబ్‌మేళా ఆచన్‌పల్లి ఇందూర్ మోడల్ పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు ముందుగా మేము పంపించే లింక్, లేదా, క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగాధాం, నాయకులు గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- మెడికల్ ఆఫీసర్ సుచరిత



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని డొంకేశ్వర్ మెడికల్ ఆఫీసర్ సుచరిత ప్రజలకు సూచించారు. మలేరియా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జీజీ నడ్కుడ, గాదేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటి సందర్శన చేసి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సురేందర్, ప్రమీల, ఏఎన్‌ఎంలు రజని, సుమలత, ఆశా వర్కర్లు ఉన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్(బోధన్): రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 3 లోపు పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. పాఠశాలలో తెలుగు, హిందీ, బోటనీ, ఎకనామిక్స్, కామర్స్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు.

సాగునీటి విడుదలపై చిత్తశుద్ధి ఏది?

- బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నేత వడ్డీ మోహన్‌రెడ్డి

నవీపేట: ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందించడంపై సర్కారు చిత్తశుద్ధి చూపడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి విమర్శించారు. కోస్లీ శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ముందస్తుగానే వరి నాట్లు వేయాలని సీఎం సూచించడంతో రైతులు ఆశగా వరి నాట్లు వేశారని, కానీ ఆశించిన వర్షాలు పడకపోవడంతో సాగునీటి ప్రాజెక్టుల వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. గోదావరి నదిలోని వృథా నీటిని రివర్స్ పంపింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా పంటలను సస్యశ్యామలం చేస్తామనే మాటను సీఎం మరిచిపోయారని గుర్తు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌పై చివరి ఆయకట్టు రైతులకు హక్కు లేదనే విధంగా ఒక్క సాగునీటి చుక్కనూ వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి, కలెక్టర్‌ల ఆధ్వర్యంలో సాగునీటి విడుదలపై ఐడీసీబీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సింగూర్, నిజాంసాగర్, కాళేశ్వర్ ప్రాజెక్ట్ ఏదైనా నీటి విడుదలే లక్ష్యంగా చర్చించాలని కోరారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని, పరిస్థితి మారకపోతే రైతుల పక్షాన వరుస ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు నాగేశ్వర్‌రావ్, శైలేష్‌కుమార్, వంశీ మోహన్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కమలానికి అవకాశమివ్వండి

- ఆర్మూర్ బీజేపీ నేత పైడి రాకేశ్ రెడ్డి



మారంపల్లిలో ఇంటింటికి తిరిగి బీజేపీ హామీ పత్రాలను అందజేస్తున్న పైడి రాకేశ్ రెడ్డి

డొంకేశ్వర్/మాక్లూర్ : బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి కలుగుతుందని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కమలానికి అవకాశమివ్వాలని కోరారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి, మాక్లూర్ మండలంలోని మెట్టు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలినడకన తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీ హామీ పత్రాలను అందజేశారు. రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ స్వప్నం ప్రజలకు నెరవేరలేదని, రాష్ట్రాన్ని పాలిస్తున్న కుటుంబమే బంగారంగా మారిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మారంపల్లిలో చేసిన అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేక పూరి గుడిసెలో ఉంటున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాలకు రూ.300 కోట్లు, మహారాష్ట్రలో సభలకు తెలంగాణ ప్రజా ధనాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కారును పారదోలి, కమలానికి అవకాశమిస్తే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 9 ఏళ్ల కాలంలో హత్యలు, బెదిరింపులతో జీవన్ రెడ్డి, నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. నాయకులు మారంపల్లి గంగాధర్, నాగ సురేశ్, రాజు, కల్లెం సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

పచ్చలనడ్కుడలో..

వేల్పూర్: పచ్చలనడ్కుడలో శుక్రవారం బీజేపీ నాయకులు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు పోలింగ్ బూత్‌లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఏలేటి రమేష్, ప్రధాన కార్యదర్శి దురాజిరవి, నాయకులు భాను, బాలకిషన్, తదితరులున్నారు.

రుద్రూర్ మండల కేంద్రంలో..

రుద్రూర్: మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి బీజేపీ పథకాల గురించి ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ పటేల్, మండల పార్టీ నాయకులు హరికృష్ణ, కృష్ణం రాజు తదితరులున్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో శుక్రవారం గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను ఓడించాలని, కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. బీజేపీ బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, సర్పంచులు ఇంద్రకరణ్, సాయిలు, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా బోనాల పండుగ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మత్స్య పారిశ్రామిక సంఘం పట్టణ అధ్యక్షులు కోట అబ్బయ్య, కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పాండురంగ విఠలేశ్వర ఆలయంలో అన్నదానం

రుద్రూర్: మండల కేంద్రంలోని పాండురంగ విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం విండో మాజీ చైర్మన్ పత్తి రాము ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో 24 గంటల పాటు అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామదేవతలకు అభిషేకం

మాక్లూర్: మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచ్ అశోక్‌రావు ఆధ్వర్యంలో గంగాజలంతో అభిషేకం చేశారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలనీ, పంటలు బాగా పండాలని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విఠలేశ్వరాలయంలో.. జెడ్పీ చైర్మన్

నవీపేట: యంచ శివారులోని విఠలేశ్వరాలయంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. సర్పంచుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఆసోల్ల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ లహరి, తదితరులు పాల్గొన్నారు.

నవనాథ సిద్ధుల గుట్టపై న్యాయమూర్తుల పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథుల సిద్ధుల గుట్టను శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల కుటుంబ సభ్యులు, జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తులను సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పీసీ గంగారెడ్డి, కిషన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) - 12.20, 9.45 ; లవ్ యూ రామ్ - 4.05 నారాయణ అండ్ కో - 6.45
స్క్రీన్-2 –	ఎస్‌పీవై (తెలుగు) - 10.50, 1.45, 4.40, 07.35, 10.30
స్క్రీన్-3 –	సత్యప్రేమ్‌కీ కథ (హిందీ) - 10.00, 4.10, 10.20 సామజవరగమన - 1.10, 7.20
స్క్రీన్-4 –	ఈ నగరానికి ఏమైంది - 1.00 సామజవరగమన - 4.00 ఇండియానా జోన్స్ (తెలుగు) - 7.00 మాయపేటిక - 10.20

సంక్షిప్తం

బాధిత విద్యార్థులకు పరామర్శ

రుద్రూర్: వర్ని హైస్కూల్ ఆవరణలో ఆడుకుంటున్న హాస్టల్ విద్యార్థులపై దాడి చేసి గాయపరిచిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఎల్లయ్యతో పాటు పలువురు డిమాండ్ చేశారు. వర్నిలో శుక్రవారం బాధిత విద్యార్థులకు శుక్రవారం వారు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

కొనసాగుతున్న రైతుల రిలే దీక్షలు

రెంజల్(బోధన్): రోడ్ల నిర్మాణం పూర్తి చేసి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 3వ రోజుకు చేరుకున్నాయి. బందల్ల(మాసపురం) రోడ్డుతో పాటు శివాలయం నుంచి మైనార్టీ కాలనీ వరకు, గంగమ్మతల్లి విగ్రహం వరకు గల రోడ్ల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆందోళన కార్యక్రమంలో రైతులు పోశెట్టి, చుక్క రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కుల వితరణ

వేల్పూర్: జానకంపేట్‌లో జీపీ కార్యదర్శి వంశీ, తన పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక ప్రైమరీ స్కూలు విద్యార్థులకు రూ.3 వేల విలువైన నోటు బుక్కులను శుక్రవారం వితరణ చేశారు. గ్రామ సర్పంచ్ సొడ ప్రేమలత, ఎంపీటీసీ సొడ చందన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి అంకం నరేశ్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని చందూర్ సర్పంచ్ కర్లం సాయరెడ్డి సూచించారు. చందూర్ మండల కేంద్రంలో మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ రైస్ మిల్లు(పసుపు, కారం, మసాలా)ను శుక్రవారం అధికారులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏపీడీ మధుసూదన్,తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్

మోర్తాడ్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు ఆడెపు గంగా ప్రసాద్ డిమాండ్ చేశారు. అధికార పార్టీ చర్యలు తీసుకోకపోతే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శుక్రవారం ఏర్గట్ల మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎడపల్లి(బోధన్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే జులై 6 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని జేఏసీ కన్వీనర్ పద్మ, జేఏసీ జిల్లా చైర్మన్ జంగం గంగాధర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎడపల్లి ఎస్సైకి అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే 17 డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నాయకులు గంగరాజు, భూమవ్వ, కుంట సంతోష్, రాజమణి, పెద్దరాజు, మహేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ రావడం గర్వ కారణం

రుద్రూర్: రుద్రూర్ గ్రామానికి చెందిన విశ్వనాథ్ మహాజన్‌కు ఫిలాసఫీ సబెక్ట్‌లో ఓయూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ రావడం ఎంతో గర్వ కారణమని తెలంగాణ గ్రూప్-1 సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, బోధన్ ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్ అన్నారు. డాక్టరేట్ సాధించడం చాలా గొప్ప విషయమని అభినందించారు. సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, విండో చైర్మన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.